# సారీ !

''ఐయాం సారీ మధూ! ఐకుడ్ నాట్ కం ఆన్ ఫ్రైడే'' అంది శారిక.

అతనేం మాట్లాడలేదు. ఆమే అంది- ''ఆ రోజు వాతావరణం కూడా బావుండలేదు. వానొచ్చేట్టుంది. మీరు రారనుకున్నాను. అందుకని నేనూ రాలేదు. మీరు వచ్చారా?''

''వచ్చాను'' అన్నాడు అతను. 'నీకోసం ఎంతసేపు నిరీక్షించానో' అని అతడనలేదు.

''దెన్ ఐయాం ఎక్స్ట్రీంలీ సారీ'' అంది ఆమె.

నోటి నుంచి చాలా తేలిగ్గా జారిపోయే పదం 'సారీ.' ఎక్కడో హృదయకోశంలో నుంచి రావాల్సిన పనిలేదు. ' ఇన్సిన్సియారిటీ! దైనేమీజ్ సారీ!' అనుకున్నాడతను మనసులో.

''రేపే మాపెళ్ళి మీరు తప్పక రావాలి'' అంది ఆమె.

అతను తలూపాడు.

''వస్తాను'' అని చెప్పి, ఆమె లైబ్రరీ మెట్లు దిగుతూ వెళ్ళిపోయింది. అలా రెండు మూడు మాటలతో వాళ్ళు విడిపోవటం ఎప్పుడూ జరగలేదు.

వాళ్ళ పరిచయం 'సారీ' తోనే మొదలైంది.

కోఠీ 'శారీ ఎంపోరియం'లో చెల్లెలికోసం చీర సెలెక్ట్ చేసి, ఆ చీర పాక్ చేయమన్నాడు అతను. పక్కనే చీరల ఎంపిక చేస్తున్న ఆమె ఆ చీరవంక చూసి - 'అరె చాలా బాగుంది. డు యు మైండ్ ఇఫ్ ఐ టేకిట్?'' అంది.

అతనేమనలేక ''సరే'' అన్నాడు.

''సారీ ! మీకిష్టమైంది నేను లాగేసుకున్నట్టున్నాను'' అంది ఆమె.

''ఫరవాలేదు'' అని ఆమెతో అని - ''వేరే చీరలేమైనా చూపించండి'' అని అన్నాడు సేల్స్‌మెన్‌తో.

ఆమె చీర తీసుకుని, విప్పి గుండెలమీదుగా పమిటె వేసుకుంటూ, కుడివేపు నడుం దగ్గరినుండి చీర చుట్టబెట్టుకుంటూ మురిసిపోతూ అడిగింది - ''ఎలా ఉంది?'' అని అలా అతన్ని అడిగి నాలిక కొరుక్కుని ''సారీ'' అంది. పరాయి మగవాడిని ఆ చీరలో తనెలా ఉందో అడగటం పొరపాటని ఆ తరువాత తెలిసింది ఆమెకు. ఆ చిలకాకుపచ్చ రంగు చీరలో ఆమె రామచిలుక లాగానే ఉంది. 'శారిక' అని గొణుక్కున్నా డతను మనసులో.

''బావుంది. ఆ చీరలో మరీ బావున్నారు మీరు'' అన్నాడు అతను.

ఆమె కృతజ్ఞతలతో అతని వంక చూసింది. తననుకున్నది సరైందని ఇంకోళ్ళు అంటే ఎవరికైనా ఆనందంగా ఉంటుంది.

''థాంక్స్'' అని చెప్పి, ఆచీర కుప్పగా పడేసి - ''ఈ చీర పాక్ చేసి ఇవ్వండి'' అని అన్నది సేల్స్‌మెన్‌తో. అతను చీర మడత పెట్టి, పాక్ చేసి. బిల్లు వేసి ఇచ్చాడు. అతనికి మరోసారి కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిపోయింది

అతని జీవితంలో నుంచి ఒక్కసారిగా నిష్క్రమించలేదు ఆమె. అలా వస్తూ, పోతూనే ఉంది. ఆ తరువాత ఆమెను అతను కలుసుకుంది సంధ్యా థియేటరులో. విశ్వనాథ్ డైరెక్షన్‌లో మంచి పిక్చరు వచ్చిందంటే మధు చూడటానికి వచ్చాడు. స్నేహితుడు వస్తాడని తనకూ, అతనికీ కలిపి రెండు టిక్కెట్లు తీసుకుని అతనికోసం నిరీక్షిస్తున్నాడు మధు. అతను ఎంతకీ రాలేదు. అప్పటికే సినిమా మొదలెట్టారు. ' ఇకరా'డని నిర్ధారించుకున్నాడు మధు. 'రేపు సారీచెప్తాడు, రాలేకపోయానని ఏదో వంక చెప్తూ. ఈ 'సారీ' లను భరించటం కష్టం' అని తనొక్కడే సినిమా చూద్దామని వెనుదిరిగేంతలో '' ఎక్స్క్యూజ్‌మీ'' అన్న ఆడగొంతు విని పక్కకు చూశాడు అతను.

ఆమే 'శారీ ఎంపోరియం'లో కలసిన 'సారీ'ల శారిక. ఆమే అతన్ని గుర్తు పట్టింది.

'' 'శారీ ఎంపోరియం'లో కలుసుకున్నాం కదూ మనం. మీరు టిక్కెట్లు కొని ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్టున్నారు. మేం రావటం ఆలస్యమైంది. క్యూలో కౌంటరు దగ్గరకొచ్చేలోగా 'హవుస్‌ఫుల్' బోర్డు పెట్టేశారు. మీవాళ్ళు వచ్చినట్టు లేదు. ఎన్ని టిక్కెట్లున్నాయి మీ దగ్గర?'' అంది ఆమె చొరవగా.

''రెండు''

''అయ్యో! మేమిద్దరమున్నామే. మేం వెళ్ళిపోతాం లెండి. మీరు సినిమా చూడండి''.

''నాస్నేహితుడెలాగూ రాలేదు మీరిద్దరూ వెళ్ళండి నేను మరోసారి చూస్తాను'' అని ఆమె చేతిలో టిక్కెట్లు ఉంచాడతను.

''సారీ ! మీరు సినిమా చేసే అవకాశం లేకుండా చేస్తున్నాం'' అంది ఆమె.

''ఫరవాలేదు. మరోసారి చూస్తాలెండి'' అని వచ్చేశాడతను.

ఆమె ఇచ్చిన టిక్కెట్ల డబ్బు జేబులో పెట్టుకుంటూ.

మూడోసారి ఆమెను స్టేట్ లైబ్రరీలో చూశాడతను. అంతకుముంది సికింద్రాబాదు లైబ్రరీలో పని చేసేవాడతను, అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా. అక్కడనుంచి అతనికి స్టేట్ లైబ్రరీకి బదిలీ అయి నెలరోజులైంది.

రిఫరెన్స్ సెక్షన్‌లో కూర్చుని నోట్స్ రాసుకుంటోందామె. బాల్ పెన్నులో రీఫిల్ అయిపోయింది. అటూ ఇటూ చూసి డెస్క్ దగ్గరున్న అతని దగ్గరకు వచ్చింది - ''పెన్‌లో ఇంకైపోయింది. మీ దగ్గర వేరే పెన్నుంటే ఇస్తారా?'' అని అడిగింది.

వచ్చిన కొత్త పుస్తకాల ఇన్-వెంట్రీ వేస్తూ తలెత్తి ఆమె వంక చూసిన మధు, తను రాసేది ఆపి, మారు మాట్లాడకుండా పెన్నిచ్చాడు ఆమెకు.

''సారీ! మీ కిబ్బంది కల్గించాను'' అని పెన్ను తీసుకుంటూ అతన్ని చూసిన ఆమె, అతన్ని గుర్తు పట్టింది.

''మీరు... మీరు... శారీ ఎంపోరియంలో... సంధ్యా థియేటర్ దగ్గరా... కదూ?'' అంది, ఆలోచనల్ని సరైన మాటల్లో వరసక్రమంలో పెట్టకుండా తడబడుతూ మాట్లాడుతూ.

ఆరోజు శారీ ఎంపోరియంలో కొన్న చిలకాకుపచ్చరంగు చీర కట్టుకొచ్చిందామె. ఆ చీరలో ఆమె బాగా ఉందనిపించింది అతనికి, తెల్లగా, పొడుగ్గా, ఎప్పుడూ నవ్వుతున్నట్లుండే కుదిరిక గలిగిన మొహంతో అందంగా ఉంది ఆమె.

''అవును'' అన్నాడు అతను.

''ఇక్కడా ఉద్యోగం?''

అతను తల ఊపాడు.

''ఇన్నిసార్లు కలసిన మనం ఇక పరిచయం చేసుకోవాల్సిందే. నాపేరు మాలతి. మీ పేరు?''

''చిలకాకుపచ్చ చీరలో ఎంతో బావున్నారు. మీ పేరు 'శారిక' అయితే బావుండేది''.

''దాందేముంది? ఇన్నిసార్లు మీ కిబ్బంది కల్గించినందుకు కన్సెషన్‌గా నన్ను శారిక అనే పిలవండి. మీ పేరు?''

''మధుసూధనం''.

''దిగులు పడకండి. నేనేం పేరు మార్చను.''

ఆమె అతని పేరు మార్చలేదు గాని, అతని జీవిత విధానాన్నే మార్చింది. ఆరోజు సాయంత్రం అయిదు గంటలదాకా ఆమె లైబ్రరీలోనే ఉంది. అతను డ్యూటీ ముగించి బయటకొస్తుంటే, రాసిన కాయితాలు బాగులో సర్దుకుంటూ - ''ఇదుగో మీపెన్ను'' అంటూ ఆమే వచ్చింది అతనితో.

అఫ్‌జల్‌గంజ్ వైపు దారితీస్తూ అడిగాడు అతను ''రీసెర్చ్ చేస్తున్నారా? ఏ సబ్జక్టులో, మీ టాపిక్ ఏమిటి?'' అని

''హిస్టరీలో, నిజాంషాహి అడ్మినిస్ట్రేషన్ మీద చేస్తున్నాను.''

''స్టేట్ లైబ్రరీలోకంటే స్టేట్ ఆర్కైవ్స్‌లో మీకు పనికివచ్చే - మెటీరియల్ దొరుకుతుం దనుకుంటాను.''

''అక్కడికీ వెళ్తున్నాను. ఎక్కడా ఏవీ సరైన స్థానంలో ఉండవు. కావల్సిన పుస్తకాలు దొరకవు. దొరికేవి రిఫరెన్స్ సెక్షన్‌లో పెడతారు. చాల ఇబ్బందిగా వుంది.''

''మరెలా? మీలాంటి రిసెర్చి స్కాలర్స్ వస్తుంటారనేగా అందరికీ అందుబాటులో వుండేట్టు వాటిని రిఫరెన్స్ సెక్షన్‌లో వుంచింది, ఎవ్వరికే ఇవ్వకుండా.''

''మీకు్కూడా ఇవ్వరా?''

''మాకు్కూడా ఇవ్వరు, నిజం చెప్పాలంటే...''

''పోనీ అబద్ధంగా చెప్పండి, తీసుకోవటానికి వీలవుతుందా?''

''ఛీఫ్ లైబ్రేరియన్ని మొహమాటపెట్టాల్సి ఉంటుంది..''

''మరి నాకోసాయం చెయ్యరాదూ. ఈ రెండు పుస్తకాలూ మీపేరున తీసుకొని ఇస్తే, వారం రోజుల్లో తిరిగి ఇచ్చేస్తాను'' అన్నది అతనికో పుస్తకాల పేర్లు రాసిన కాగితమిస్తూ.

''అలాగే, ఒకటొకటే తీసుకోండి.''

''సారీ మీకిబ్బంది కలిగిస్తున్నాను. మరి రేపొకటి ఇవ్వాలి''.

ఆ మర్నాడు రిఫరెన్స్ సెక్షన్‌లో పుస్తకం తన పేరున తీసుకొని ఇచ్చాడు అతడు ఆమెకు. ఆమె అది చదివి నోట్స్ రాసుకుని తిరిగి ఇచ్చేసింది. ఆ తరువాత మరొకటి తీసుకుంది. అతనితో పరిచయమవటం వల్ల ఆమెకు రోజూ స్టేట్ లైబ్రరీ చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన బాధ తప్పింది.

నాలుగోసారి పుస్తకం వాపసు చేయటానికి వచ్చినపుడు అడిగాడతను ఆమెను.

''ఎంతవరకు వచ్చింది మీ థీసిస్?'' అని

''మెటీరియల్ కలెక్ట్ చేశాను కానీ, ఓ పద్ధతిలో పెట్టటం కుదరటం లేదు'' అంది ఆమె.

''మీరు సెలెక్ట్ చేసిన మెటీరియల్ ఓ సారి చూపెట్టండి. నేను చూసి చెప్తాను, అంటే నాకు తోచిన సలహా ఇస్తాను.''

''మీరు ఏం చదివారు?'' అప్పుడడిగింది ఆమె. అప్పటిదాకా అతడు లైబ్రరీ సైన్స్ డిప్లొమా చేసి, ఉద్యోగం సంపాదించుకున్నాడన్న ఊహలో ఉంది ఆమె. సలహా చెప్తానంటే బహుశః అతడు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి ఉండాలి అనుకుంది ఆమె.

''నేను హిస్టరీలోనూ, ఆర్కియాలజీలోను ఎం. ఏ. చేశాను''.

''మరి వచ్చి ఈ లైబ్రరీలో పడ్డారేం?''

''బతకటానికి ఏదో ఉద్యోగం, బి. ఎల్. ఎస్.సి కూడా చేశాను. ఉద్యోగానికిది పనికి వచ్చింది, ఎమ్మేలు ఎందుకూ పనికి రాలేదు''.

అతను తక్కువ చదువుకున్నాడని అంచనా వేసినందుకు తనలో తను 'సారీ' చెప్పుకుంది ఆమె.

శుక్రవారం అతనికి ఆఫ్, ఆరోజు పొద్దున పది గంటలకు కలుసుకున్నారు లైబ్రరీ మెట్లమీదే. ఆమె కలెక్ట్ చేసిన మెటీరియల్ తెచ్చింది. ఇద్దరూ ఆటోలో జూ పార్క్‌కు వెళ్ళారు. మెటీరియల్ ఓ పద్ధతిలో అమర్చలేదు ఆమె. అంతా కలగాపులగంగా ఉంది. ఆమె టాపిక్‌ను చర్చించి, ఛాప్టర్‌వైజ్‌గా రాసి చూపించాడతను.

''చాలాబావుంది, బాగా ఎనలైజ్ చేశారు'' అంది.

ఆ తరువాత మొదటి చాప్టరు గూర్చి చర్చించారు. మర్నాడు రాసి తీసుకువస్తానన్నది ఆమె

మొదటి ఛాప్టరు. జూ పార్క్ నుండి బయట పడేటప్పటికి సాయంత్రం అయిదైంది.

మర్నాడు ఆమె లైబ్రరీకి వస్తుందేమో అని ఎదురు చూశాడు అతను. ఆమె రాలేదు. ఏనాటి కానాడు ఆమె వస్తుందేమోనని ఎదురు చూడటం అతని పనైంది. ఆమెని కలుసుకోవటం, మాట్లాడటం అతనికెంతో ఆనందంగా ఉండేది. మనసులో ఊహల హరివిల్లులు విచ్చుకునేవి. ఆమె దగ్గరున్నంత సేపూ అతడు ప్రపంచాన్ని మరచిపోయేవాడు.

తరువాత మూడు రోజులకు వచ్చింది ఆమె. ''సారీ! చెప్పినట్టు రాలేకపోయాను. ఛాప్టరు పూర్తి కాలేదు, అందుకని రాలేదు'' అంది.

అతను ఆమె దగ్గర ఫైలు తీసుకుని చదివాడు. ఆతనికేం నచ్చలేదు.

''మీరేమనుకోనంటే ఓ మాట. మీ ప్రజంటేషను నాకేం నచ్చలేదు. అఫ్‌కోర్స్ అక్కడక్కడా బాగానే ఉందనుకోండి. మొత్తం మీద వ్యాసంలో సెమ్మెట్రీలేదు'' అన్నాడతను.

''పోనీ మీరు సరిచేసి ఇవ్వరాదూ, ట్రబుల్ అనుకోకపోతే? సారీ!'' అంది.

''మరి రేపు రండి. నా చేతనైనట్లు రాస్తాను.''

''ఒక్కరోజులో ఐపోతుందా? రేపు ప్రొఫెసర్‌కి ఫస్ట్ ఛాప్టర్ ఇస్తానన్నాను''.

''అవుతుంది లెండి. రండి''

అతనారోజు రాత్రి ఒంటిగంట దాకా కూర్చుని ఆ ఛాప్టరు తిరగ రాశాడు. మర్నాడు ఆమె వచ్చి అది చదివి చూసి చాలా మెచ్చుకుంది.

''ఈ సారి మా ప్రొఫెసర్ దీన్ని మళ్ళీ రివైజ్ చేయమంటాడనుకోను'' అంది. ఆమె అనుకున్నట్లుగానే ఆమె గైడ్‌కి అది నచ్చింది. చాలా బాగా రాశావని మెచ్చుకున్నాడు.

అలా సాగింది వారి స్నేహం. ప్రతి శుక్రవారం అతనికి సెలవు కావటాన ఆమె వచ్చేది. ఇద్దరూ కలిసి తిరిగేవారు. థీసిస్‌ను గూర్చిన చర్చ సాగేది. అతను ఆమె ఛాప్టర్లు తిరగ రాసి పెట్టేవాడు. ఆమెకు ఇంకా మెటీరియల్ కలెక్ట్‌చేసి పెట్టేవాడు. తనకు తెలియని విషయాలు అతనికి తెలిసినందుకు అప్రతిభురాలయ్యేది ఆమె.

ఆమె అతన్ని మెచ్చుకున్నప్పుడల్లా అతనికేవో అనందలోకపు ద్వారాలు తెరచుకున్నట్లుండేవి. తనను తాను మరిచిపోయేవాడు. ''మీరు ఎవరి పాలనను గూర్చి పరిశీలించినా, చివరకు ఈనాటి ప్రజా ప్రభుత్వపు నల్లదొరల రాజ్యంలో అయినా మనకు కనిపించేది ఒక్కటే - ఏ పాలకుడూ ప్రజలను గూర్చి ఆలోచించడన్నది. తమ రాజకీయపు ఎత్తుగడల్లో ప్రజలు పావులు. వాళ్ళు ఏ ఒప్పందాలు చేసుకున్నా, యుద్ధాలు చేసినా, ప్రజలకెలాంటి హామీలు ఇచ్చినా ఏవీ ప్రజాక్షేమాల్ని దృష్టిలో పెట్టుకొని చేసినవి కావు. అందుకనే యేట్స్‌కవి దేశంలో ఏ యుద్ధం జరిగినా దేశంలో బీదప్రజలకేమీ ఒరగదని చెప్తూ అన్నాడు. 'నోలైకీ ఎండ్ కుడ్ బ్రింగ్ దెం లాస్, ఆర్ లీవ్ దెం హేపియర్ దాన్ బిఫోర్' అని 'అందాకా ఎందుకు - శ్రీశ్రీ చెప్పనే చెప్పాడు ' ఏదేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం? నరజాతి చరిత్ర సమస్తం పరపీడన

పరాయణత్వం' అని కనుక మీరూ ఈ దృష్టితో మీ థీసిస్ రాయవలసి ఉంటుంది'' అని చెప్తుండేవాడు అతను.

''అబ్బ ! ఇదంతా నావల్ల అయేట్టు లేదు. మిమ్మల్ని కట్టుకుంటే మీరే చేసి పెడతారుగా'' అనేది శారిక.

''అదేం మాట శారికా? మీవల్ల కాని పనులు చేయించుకోవటానికి ఎవర్నో ఒకర్ని కట్టుకోవాల్సిన అవసరమేముంది? అలా అయితే ఎంతమందిని కట్టుకోవాల్సి వస్తుందో?'' అనేవాడు మధు.

''మీరు మరీను, ఓ ఆడది ఎంతమందిని కట్టుకుంటుందేం?''

శారిక తన సిద్ధాంత వ్యాసాన్ని యూనివర్సిటీలో సబ్మిట్ చెయ్యటానికి రెండేళ్ళు పట్టింది. మధు పరిచయమైన తరువాత పని చురుగ్గా సాగి సంవత్సరంలో పూర్తిచేయగలిగింది. ఆమె పి.హెచ్.డి.వైవా అయిన రోజు అతడు సెలవుపెట్టి వచ్చాడు. ఆర్ట్స్ కాలేజీ హిస్టరీ డిపార్ట్మెంట్ బయట కారిడార్‌లో ఆమె కోసం నిరీక్షిస్తూ గడిపాడు. వైవా అయిన తరువాత ఆమెకోమంచి పార్టీ ఇవ్వాలని అతని ఉద్దేశం. ఆతరువాత ఇందిరా పార్క్‌కు వెళ్తారు తాము. ఇప్పటిదాకా జాప్యం చేస్తూ వచ్చాడు తను. తనకు తెలుసు ఆమె తనను ప్రేమిస్తోంది అని. అలా అని ఎన్నో సార్లు సూచించింది కూడా ఆమె. తనే పెళ్ళి ప్రస్తావన తీసుకురాలేదు. ఇవాళ చెప్పాలి. ఆమె కాదనదు. వీలైనంత త్వరలో ఆమెని పెళ్ళి చేసుకోవాలి. తమ పెళ్ళికి పెద్దల ఆశీర్వాదాలే కాని, అభ్యంతరాలుండవు. ఆమె మాటలవల్ల తను గ్రహించాడా విషయం. పెళ్ళి, ఆమెతోటి సాంగత్యం, జీవితం రంగుల కలగా, ఇంద్రధనుస్సులా ఉండదూ?

అతను ఇలా ఊహాలోకాల్లో విహరిస్తున్నప్పుడు ఆమె వచ్చింది ఆమె ముఖంలో ఉత్సాహం, కళ్ళలో తళుకు.

''హౌడిడిట్ గో?'' అడిగాడతను.

''ఫైన్'' అంటూ పరీక్షకులు వేసిన ప్రశ్నలు, తన సమాధానాలు, తనను చిక్కుపెట్టటానికి వాళ్ళు ప్రశ్నలు వేస్తే - 'మధు నావెంట లేడే, ఈ ప్రశ్నకు అతనేం సమాధానం చెప్పేవాడో' అనుకోవటం, చివరకు తన గైడ్ తనను ఎలా ఆదుకొన్నదీ అన్నీ వివిరంగా చెప్పింది. తనకే పి.హెచ్.డి. పట్టం వచ్చినంత సంబరపడిపోయాడు మధు.

ఇద్దరూ బస్సు స్టాపు కొచ్చారు.

''ఆటోలో వెళ్దాం. ఇవాళ మీకు పార్టీ ఇవ్వాలి. నా వల్ల కాదు గానీ, వీలైతే ఈ ఘనవిజయం సందర్భంగా మీ పేరుకో ఫతే దర్వాజా కట్టించాలని ఉంది'' అన్నాడతను.

'' ఓ ఐయాంసారీ! ఇవాళ తొందరగా ఇంటికెళ్ళాలి అమ్మరమ్మంది. ఏదో పని ఉందట. శుభవార్త చెప్పొద్దూ వాళ్ళకు?'' అంది శారిక.

''నేనూ ఓ శుభవార్త చెబ్దామనుకున్నానే !''

''మీరు చెప్పేది నాకు తెలీదా? వచ్చే శుక్రవారం పది గంటలకు వస్తాను. లైబ్రరీ దగ్గరే ఉండండి. మీరెక్కడికి వెళ్దామంటే అక్కడికి వెళ్దాం. మీరు పార్టీ ఇవ్వండి. మన భవిష్య జీవితాన్ని గూర్చి చర్చిద్దాం, ప్రణాళికలు వేసుకుందాం. మరి ఇవాళ్టికి వెళ్ళేదా? సారీ ఫర్ డిజప్పాయింటింగ్‌యు''. అంది ఆమె.

అతనేం మాట్లాడలేకపోయాడు అతనిలో ఉత్సాహం చచ్చిపోయింది. అయినా తను చెప్పే మాట ఆమె గ్రహించిందన్న ఊరట కలిగిందతనికి 'శుక్రవారమంటే ఎన్నిరోజులు మూడు రోజులేగా. అప్పుడు తీరిగ్గా మాట్లాడుకోవచ్చు' అనుకున్నాడతను.

''నాబస్సు వస్తోంది. మీట్ యు ఆన్ ఫ్రైడే. అందాకా కలల్లో విహరించండి.'' అంటూ వీడ్కోలు చెప్పి. బస్సెక్కి వెళ్లిపోయిందామె.

తరువాత తన బస్సెక్కి ఇంటికి వెళ్ళిపోయాడతను.

ఆ రోజు శుక్రవారం. ఆమె రమ్మన్నట్లుగా పది గంటలకంటే ముందే వచ్చాడతను లైబ్రరీకి, శ్రద్ధగా, నీట్ గా తయారైవచ్చాడు. ఆమె రావటం మామూలుగా ఆలస్యమవుతుంది. ఆమెకోసం నిరీక్షిస్తూ లైబ్రరీలోకి వెళ్ళకుండా బయట మెట్లమీదే నిలబడ్డాడు.

పదిన్నరైంది.

పదకొండున్నరైంది, పన్నెండైంది. ఆమె అయిపు లేదు. వాన వచ్చేటట్లుంది.

'ఆమె ఇంకా ఎందుకు రాలేదు? వస్తానని రాకుండా ఉండదే. ఒంట్లో బాగాలేదా? లేక ఎవరైనా బంధువులు వచ్చి వీల్లేకపోయిందా? వస్తుంది, ఎందుకురాదు? బస్సు దొరకటం లేటయిందేమో?' అని అతని మనస్సు పరిపరి విధాల పోయింది.

సన్నగా తుంపర పడుతుంటే తడుస్తానేమో అని లైబ్రరీలోకి వెళ్ళాడు. అక్కడా స్తిమితంగా కూర్చోలేకపోయాడు. బయటకొచ్చాడు.

వాన కురవటం లేదు. ఒంటిగంటైపోయింది. 'ఆమె ఇకరాదు. ఇంటికి వెళ్ళిపోదాం' అనుకున్నాడతను. అయినా వెళ్ళలేకపోయాడు. 'ఆమె వస్తుందేమో తను లేకపోతే నిరాశపడి వెళ్ళిపోతుందేమో' అనుకున్నాడు. సాయంత్రం ఐదింటిదాకా లైబ్రరీలోకీ, బయటికీ వచ్చిపోతున్నాడు. లైబ్రరీలో అతని కొలీగ్ రామచంద్రం జోక్ చేశాడు కూడా - '' ఏమోయ్! ఇంకా నీ రామచిలుక రాలేదా? ఎక్కడికో ఎగిరిపోయి ఉంటుంది'' అని.

సాయంత్రం ఆరింటికి అతను నీరసంగా ఇంటిముఖం పట్టాడు.

అలాంటి శుక్రవారాలు రెండు గడచిపోయింతరువాత ఆమె దగ్గరినుంచి ఓ శుభలేఖ, ఉత్తరం వచ్చాయి అతనిలైబ్రరీ అడ్రసుకు. శుభలేఖ చూడగానే అతను నిర్విణ్ణుడైపోయాడు.- వచ్చే ఆదివారం ఆమెపెళ్ళి. ఎవరితోనో. ఉత్తరం తెరచి చదివాడు. ''డియర్ మధూ ! సారీ, నేను ఆరోజు శుక్రవారం రాలేకపోయాను. ఆరోజు వైవా అయిన తరువాత ఇంటికి వెళ్తే తెలిసింది నాకు

పెళ్ళిచూపులట. అందుకనే అమ్మ త్వరగా రమ్మన్నదట. వాళ్ళు ముందుగా చెప్పలేదు నాకు. పెళ్ళిచూపుల్లో ఆయనకు నేను నచ్చాను. ఆయన స్టేట్స్‌లో ఉంటున్నారు. మా నాన్న స్నేహితుడి కొడుకు. మళ్ళీ వెళ్ళిపోవాలట, సమయం ఎక్కువ లేకపోవటం వల్ల హడివుడిగా పెళ్ళి చూపులయ్యాయి. రేపాదివారం మా పెళ్ళి. పెళ్ళి చేసుకుని నన్ను వెంటబెట్టుకుని వెళ్ళిపోవాలని ఆయన ఉద్దేశం. నాకూ ఆయన నచ్చారు. చాలా తమాషాగా మాట్లాడతారు. అమెరికాలో పైకి వెళ్ళే అవకాశాలు ఉన్నాయి. అందువల్లే ఆయన్ను పెళ్ళి చేసుకోవటానికి అంగీకరించాను. ఇందులో ఇన్విటేషన్ కార్డు పంపుతున్నాను. మీరు పెళ్ళికి తప్పక రావాలి. మావార్ని పరిచయం చేస్తాను. ఉంటా మరి.

- మీ శారిక''

ఆ ఉత్తరాన్ని చూసి అతను క్రుంగిపోయాడు. అతనిదే తప్పు. పచ్చని చెట్లు వెతుక్కుంటూ పోవటం పక్షికి సహజం. చిలక ఎగిరి పోయింది, మరో పచ్చని చెట్టు చూసుకుంటూ.

అతనికి పెళ్ళికి వెళ్ళాలని లేదు. పెళ్ళికి ముందు రోజు వచ్చి స్వయంగా పిల్చింది, శుక్రవారం తాను రానందుకు 'సారీ'లు చెప్పుకుంటూ.

అప్పుడనుకున్నాడు అతను ' ఇన్ఫిరియారిటీ ! దై నేమీజ్ సారీ' అని

పెళ్ళికి వెళ్ళాడతను. ఆమె అతన్ని తన వారికి పరిచయం చేసింది ''వీరు మధుసూధనం గారు. స్టేట్ లైబ్రరీలో లైబ్రేరియన్. నేను థీసీస్ రాసేటప్పుడు చాలా సాయం చేశారు'' అని.

''ఓ అలాగా ! గ్లాడ్ టు మీట్ యూ'' అన్నాడతను ముందుకు చెయ్యి చాస్తూ.

మధు అతనితో కరచాలనం చేస్తూ అన్నాడు - ''దీర్ఘమైన వైవాహిక జీవితం అందంగా, ఆనందంగా గడపండి'' అని శుభాకాంక్షలు తెలియచేస్తూ.

''థాంక్యూ'' అన్నాడతను.

''మరి వస్తాను మాలతి గారూ!'' అన్నాడతను ఆమెతో. ఇప్పుడామె అతనికి శారిక కాదు, వట్టి మాలతి. ఇప్పుడామె అతని మనఃపంజర శుకం కాదు. దృఢమైన ఆసరా చూసుకుని పైకి ఎగబాగే మాలతీలత.

''అప్పుడే వెళ్ళి ఏం చేస్తారు, కాసేపు ఉండరాదూ?'' అంది ఆమె.

''కాదు, వెళ్ళాలి''.

''సారీ ! మీరింకాస్సేపు ఉంటే బావుండేది'' అంది ఆమె.

ఆమె 'సారీ' అని అనకపోతే ఇంకాస్త సేపు ఉండేవాడేమో అతను. 'సారీ'లు వినీ వినీ అలసిపోయాడతను. ''వస్తా'' అని చెప్పి వెళ్ళిపోయాడు.

'ఆంధ్రప్రభ' సచిత్రవారపత్రిక

6-12-1989